# మైనర్ల డ్రైవింగ్.. డేంజర్

- ఇష్టారాజ్యంగా వాహనాల స్కిటీలు
- నిబంధనలపై అవగాహన లేకపోవడంతో ప్రమాదం
- తల్లిదండ్రులు మారకపోతే ఇబ్బందులు తప్పవంటున్న పోలీసులు

"ఆర్థిక స్తోమత లేకపోయినా కొడుకు అడిగాడని అప్పు చేసి మరీ ఖరీదైన ద్విచక్రవాహనం ఇప్పించారు ఆ తల్లిదండ్రులు. కుమారుడు మైనర్ అయినప్పటికీ వాహనం నడుపుతున్నా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఓ రోజు మైనర్ తన తమ్ముడిని వెనకాల కూర్చోబెట్టుకొని జూబ్లీహిల్స్ రోడ్డునంబరు.36కు వచ్చి వేగంగా కుడివైపు మలుపు తీసుకుంటూ అదే దారిలో వెళ్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఫలితంగా మైనర్ అక్కడికక్కడే మరణించగా ద్విచక్ర వాహనదారుడు దివ్యాంగుడిగా మారాడు."

"బంజారాహిల్స్‌లో ఓ మైనర్ తన స్నేహితుడి వద్ద రెండు రోజులు వాడుకుంటానని ద్విచక్రవాహనం తీసుకున్నాడు. రాత్రి కాగానే దాని మీద షికార్లు కొట్టడం మిగతా వారితో రేసింగ్‌లు పెట్టుకోవడం మొదలు పెట్టారు. రోడ్డునంబరు.12లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రైవింగ్ చేసి ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు."



బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలతో రహదారులపై వేగంగా దూసుకెళ్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. పశ్చిమ మండలంలో ఏటికేడు ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ ఘటనల్లో కొందరు మృత్యువాతపడుతుండగా, మరికొందరు క్షతగాత్రులు అవుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో వాహనం నడిపిన వారే ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకవైపు పోలీసులు దాడులు చేస్తూ వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నా మార్పు రావడం లేదు.

**పశ్చిమ మండలంలో మూడేళ్లలో కేసులు ఇలా..**

| అంశం | 2024 (జూన్ వరకు) | 2023 | 2022 |
|---|---|---|---|
| మైనర్ డ్రైవింగ్ | 121 | 243 | 663 |
| ప్రమాదకర డ్రైవింగ్ | 178 | 381 | 568 |
| గుర్తింపు పత్రాలు లేకుండా | 873 | 2,262 | 3,932 |
| డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా | 3,124 | 7,497 | 12,189 |

### మైనర్లపై నిఘా



మైనర్లు వాహనాలు నడపడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేస్తున్నాం. అవసరమైతే వాహనం ఇచ్చిన వారిపైనా, వాహనం ఎవరి పేరు మీద ఉందో వారిపైనా కేసు నమోదు చేస్తున్నాం. పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు ఆలోచించాలి.

- కట్టా హరిప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ, పంజాగుట్ట

### యథేచ్ఛగా రోడ్లపైకి..

సాధారణంగా 18 సంవత్సరాలు పూర్తయి లైసెన్స్ తీసుకున్నాక వాహనాలతో రోడ్డెక్కేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఏడోతరగతి చదువుతున్న మైనర్లు కూడా వాహనాలు వేసుకొని యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారు. కొంతమంది ప్రధాన రోడ్లపై రాకున్నప్పటికీ వీధుల్లో తిరుగుతూ ప్రమాదాలు చేస్తున్నారు. మరికొందరు ఏకంగా రేసింగ్ పేరిట చేస్తున్న హంగామా మిగతా వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతోంది. అర్ధరాత్రి 12 తర్వాత వీరు నడిపే వేగం తోటి ప్రయాణికుల వెన్నులో ఒణుకు పుట్టిస్తున్నది. చిన్న, చిన్న అవసరాల కోసం తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది.

### రయ్.. రయ్ మంటూ..

మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న ఘటనలు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ విశాలమైన రహదారులు ఉండడం వల్ల మైనర్లు వాహనాలతో భారీ శబ్దాలు, అతివేగంతో దడ పుట్టిస్తున్నారు. 2023లో పంజాగుట్టలో 20, ఎస్ఆర్‌నగర్‌లో 43, జూబ్లీహిల్స్‌లో 151, బంజారాహిల్స్‌లో 29 కేసులు నమోదయ్యాయి. 2024లో ఇప్పటి వరకు పంజాగుట్టలో 34, ఎస్ఆర్‌నగర్‌లో 16, జూబ్లీహిల్స్‌లో 45, బంజారాహిల్స్‌లో 21 కేసులు నమోదయ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో పబ్‌ల సంఖ్య అధికంగా ఉండడంతో నగర నలుమూలల నుంచి యువత పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదకరంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. పోలీసులు జిగ్ జాగ్ బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ వారికి చిక్కకుండా దూసుకుపోతున్నారు.

### తల్లిదండ్రులు మారాలి..

మైనర్ల కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ పోలీసులు కారణాల అన్వేషణ మొదలు పెట్టారు. పశ్చిమ మండలంలో అత్యధిక ప్రమాదాలు మైనర్ల కారణంగా జరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రుల్లో మార్పు తీసుకువచ్చేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న వయసులో వాహనం కొనిచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న తల్లిదండ్రుల వల్ల ఇతరులు ప్రాణాలు కోల్పోతున్నారని పోలీసులు అంటున్నారు.



రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు

## తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది

- ఇన్‌చార్జి గవర్నర్ రాధాకృష్ణన్

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్ రాధాకృష్ణన్‌ను సోమవారం రాత్రి జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు పగుడాకుల బాలస్వామి ఆధ్వర్యంలో గవర్నర్‌ను సత్కరించి పుస్తకం బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు చాలా మంచివారని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ప్రశంసించారు. ఇక్కడ జరుగుతున్న బోనాల మాదిరిగానే తమ సొంత రాష్ట్రం తమిళనాడులో కూడా ఉత్సవాలు జరుగుతాయని గుర్తు చేశారు. జార్ఖండ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల ఆచార వ్యవహారాలు ఆకట్టుకుంటాయన్నారు. దేశానికే ఆర్థిక రాజధాని ముంబాయి కేంద్రంగా మహారాష్ట్రకు సేవ చేసే అవకాశం తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## పర్యావరణవేత్తకు చికాగో యూనివర్సిటీ డాక్టరేట్





డాక్టరేట్ పట్టా అందుకుంటున్న గంగాధర్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి శుద్ధి సమస్యలో శాస్త్రీయ ప్రకృతి ఆధార పరిష్కార పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వాటిని వివిధ సంస్థల్లో అమలు చేస్తూ పర్యావరణ పరిరక్షణ మీద కృషి చేస్తున్న దొంతిరెడ్డి గంగాధర్ రెడ్డిని చికాగో ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన యూనివర్సిటీ కాన్వకేషన్ కార్యక్రమంలో ఆయన ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లో విలేకరులతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, వాగులు కలుషితనీటితో ఉండడాన్ని గమనించి వాటిని ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో శుద్ధి చేసే విధానాలను తాను అవలంబించానని, చాలాచోట్ల విజయవంతమయ్యానని పేర్కొన్నారు.



నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రవీందర్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, షేక్ మహ్మద్
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



బోనాలు తీసుకెళ్తున్న మహిళలతో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

## ఫిలింనగర్‌లో వైభవంగా బోనాల వేడుకలు

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ వినాయక నగర్‌లో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. నూతనంగా ప్రతిష్ఠించిన ఎల్లమ్మ-ఈదమ్మకు మహిళలు బోనం సమర్పించారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పూజాదికాల్లో పాల్గొన్నారు.



ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తదితరులు

## వైభవంగా ఫలహార బండి ఊరేగింపు

ఖైరతాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేటర్ విజయారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఊరేగింపులో పాల్గొన్నారు.



మహాకాళి ఆలయానికి బోనంతో వెళ్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

## మహాకాళికి విజయారెడ్డి బోనం

ఖైరతాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బోనాల వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాకాళి అమ్మవారికి కాంగ్రెస్ నాయకులతో కలసి బోనం సమర్పించారు.

# భక్తులు నన్ను మరిచి ఇబ్బందులు పడ్డారు

- భవిష్యవాణి వినిపించిన మోహన్

అమీర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గతంలో భక్తులు నన్ను మరిచిపోయారు. పూజలు తగ్గాయి. అందుకే ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అంతా బాగానే ఉంది. ప్రజలకు రక్షణగా ఉంటా అంతా మంచే జరుగుతుందుంటూ రంగం కార్యక్రమంలో భవిష్యవాణిని మోహన్ వినిపించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమీర్‌పేటలోని లక్ష్మీదుర్గా సోనాబాయమ్మ ఆలయం వద్ద సోమవారం రాత్రి రంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సాపూర్ సమీపంలోని గుమ్మడిదలకు చెందిన మోహన్ అమ్మవారి ఆలయం ఎదురుగా వచ్చి కుండపై నిలబడి భవిష్యవాణి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు మోహన్ సమాధానాలు చెప్పారు. తనను భక్తితో కొలవండని, ఆలయాలను అభివృద్ధి చేయండని వెల్లడించారు. ముందు ముందు మంచి వర్షాలు పడతాయి. కరువు తీరుతుంది. అన్ని వర్గాల్లో ఆదాయం పెరుగుతుందని భవిష్యవాణి వినిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నిరంజన్, సభ్యులు కృష్ణ, గొలుసుల సత్యనారాయణ, బాబురావు, బాబు, కృష్ణ, కేతినేని సరళ పాల్గొన్నారు.



భవిష్యవాణిని వినిపిస్తున్న మోహన్



జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ రోసిరెడ్డి

## టీసీఈఐ నూతన కమిటీ

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద ప్రాంతీయ ఈవెంట్ అసోసియేషన్‌గా పేరుగాంచిన తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ కొలువుదీరింది. జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో మంగళవారం టీసీఈఐ 6వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. విశ్రాంత ఐఆర్ఎస్ రోసిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఈ నెల 7 నుంచి 21 వరకు ఎన్నికలు జరగగా, నూతన కమిటీ పేర్లను ప్రకటించారు. టీసీఈఐ అధ్యక్షుడిగా ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రవి కుమార్ బుర్రా, కోశాధికారిగా తౌఫిక్ ఎండీ ఖాన్, ఉపాధ్యక్షులుగా శ్రవణ్ మాదిరాజు, వెంకటేశ్వర్లు ఆకులపల్లి, వేపూరి కార్తీక్, ఆదిత్య దీనదయాళ్, శంకర్ కృష్ణమూర్తి, జోసెఫ్ సుందర్, సంయుక్త కార్యదర్శిగా రమేష్ ముప్పన, సభ్యులుగా శ్వేతా నీరజ్‌ఠాకూర్, రవినాయర్, అనూప్‌రావు, మొహియుద్దీన్, అమిత్ అగర్వాల్, సౌరబ్ సురేఖ ఎన్నికయ్యారు. తెలంగాణ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్(టీఈఎంఏ) అధ్యక్షుడిగా హరీష్ రెడ్డి జక్కిడి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ ఎన్నికయ్యారు. అనుబంధ సంస్థలకు కూడా నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

# బీసీల ఐక్యతకు క్షేత్రస్థాయిలో కమిటీలు

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీసీలను సంఘటితం చేసి హక్కులు, రాజ్యాధికారం సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచే కమిటీలు వేస్తామని తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఆయన 133 బీసీ కులాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఒక్క తాటిపై తీసుకురావడానికి అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. గతంలో జరిగిన తప్పుల గురించి తెలియజేస్తూ భవిష్యత్‌లో అవి పునరావృతం కాకుండా 2029 ఎన్నికల వరకు బీసీలకే 33 జిల్లాల్లో 33 మంది ఎమ్మెల్యేలు గెలిచేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. సమావేశంలో కుల సంఘాల ప్రతినిధులు భాస్కర్‌రావు, మహేందర్, చంద్రశేఖర్, వెంకటేష్, లక్ష్మి, తిరుమలదేవి, కోల శ్రీనివాస్, రాచమల్లు, బాలకృష్ణ, రాములు, వీరాంజనేయులు, కాసారం రమేష్ పటేల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణగౌడ్



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నియామకపత్రం ఇస్తున్న సర్దార్ పుటం పురుషోత్తమరావు, తదితరులు

## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిజాం క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యేకు నియామకపత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు, సభ్యులు వీరమల్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సి.విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరుకాపులతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం ఉన్నతికి ప్రభుత్వపరంగానూ, వ్యక్తిగతంగానూ చేయూత అందిస్తానన్నారు. అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మంగళారపు లక్ష్మణ్, ఆది విష్ణుమూర్తి, ఎస్.మల్లేష్, ఎర్ర నాగేందర్, ఊసా రఘు, అనిల్, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, రామారావు, పి.ఎల్.ఎన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మహిళా విభాగం

## జాతీయ అధ్యక్షురాలిగా నాగమల్లేశ్వరి

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి నియమితులయ్యారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల-చలో ఢిల్లీ' జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరగబోయే మహాధర్నాకు మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పాల్, నాయకులు కారంపూడి మైనర్‌బాబు, లక్ష్మణ్, బడుగు సాల్మన్, కందుకూరి జార్జ్, గొట్టిపాటి యోగి, తదితరులు పాల్గొన్నారు.



నాగమల్లేశ్వరికి నియామకపత్రం అందజేస్తున్న చెన్నయ్య



శ్రీనివాస్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న భాస్కరరావు

## ధార్మికసేవ శిఖర అవార్డు

ఎర్రగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డికి ధార్మికసేవ శిఖర అవార్డు లభించింది. ఇటీవల త్యాగరాయ గానసభలో జరిగిన 'తెలుగు కళామాలిక' అనే కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎర్రగడ్డలో విలేకరులతో మాట్లాడారు. ఉచిత వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ, పేదలకు దుప్పట్ల పంపిణీ, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అవార్డు అందజేశారని తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ కోట నీలిమ

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి అభినందన

అమీర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన సికింద్రాబాద్‌లోని బండిమెట్ పాటిగడ్డకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సీహెచ్ వినయ్ కుమార్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఉచితంగా మెదడువాపు నివారణ టీకాలు

అల్లాపూర్, 30 జూలై (ఆంధ్రజ్యోతి): మెదడు వాపు(జాపనీస్ ఎన్‌సెఫలైటిస్) వ్యాధి నివారణకు ఉపకరించే వ్యాక్సిన్‌ను పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీలలో) ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు ఉచితంగా వేస్తున్నట్లు పర్వత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినిరెడ్డి తెలిపారు. మొదట జీరో డోసు టీకా వేయించుకున్న నెల రోజుల వ్యవధిలో బూస్టర్ టీకా తీసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 86391 62793లో సంప్రదించాలని సూచించారు.



డాక్టర్ షాలిని

## సిటీ బస్సు కండక్టర్‌పై విద్యార్థుల దాడి

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'సిటీ బస్సులో లోపల ఖాళీగా ఉంది. ఫుట్‌బోర్డుపై నుంచి లోపలికి రావాలి' అన్నందుకు కండక్టర్‌పై విద్యార్థులు దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పంజాగుట్టలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(ఏపీ28జెడ్4810) రూట్ నెంబర్ 19కె/జె జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తుంది. ఎస్ఆర్‌నగర్ వద్ద విద్యార్థులు ఎక్కారు. బస్సు అమీర్‌పేట దాటి పంజాగుట్ట వస్తుండగా, ఫుట్‌బోర్డుపై నుంచి లోపలికి రావాలి అని కండక్టర్ శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులకు సూచించాడు. తమనే ప్రశ్నిస్తావా అంటూ విద్యార్థులు కండక్టర్‌పై దాడి చేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.



శ్రీనివాస్‌గౌడ్



ఆలయధర్మకర్త మండలి సభ్యులను సత్కరించిన మున్నూరుకాపు మహాసభ సభ్యులు

## నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులకు సత్కారం

**బౌద్ధనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ధర్మకర్తమండలి సభ్యులుగా నియమితులైన మున్నూరుకాపు కులస్థులైన కైలాస్ అరుణ్‌కుమార్, నరేష్‌ను మున్నూరుకాపు మహాసభ సభ్యులు సత్కరించారు. మంగళవారం నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో మాజీ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు, మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ధర్మకర్త గంప చంద్రమోహన్, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన సత్రం ధర్మకర్తలు పోతాని నరసింహారావు, ప్యాట రవీందర్, తెలంగాణ మున్నూరుకాపు మహాసభ మ్యారేజ్ బ్యూరో చైర్మన్ గోపాల రాధాకృష్ణ, అనంతుల శ్రీప్రహ్లాద్, రవికాంత్, దేవేశ్ తదితరులు అరుణ్‌కుమార్, నరేష్‌కు శాలువా కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. అంతకు ముందు వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

## నేటి యువత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి: ప్రొ. కొండ నాగేశ్వర్‌రావు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రొ. కొండ నాగేశ్వర్‌రావు తదితరులు

**తార్నాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** నేటి యువత కవితలు రాయడాన్ని అలవర్చుకుని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలువాలని ప్రొ. కొండ నాగేశ్వర్‌రావు అన్నారు. దొంతం చరణ్ అధ్యక్షతన అరుంధతీరాయ్‌కి సంఘీభావంగా కలలు చిగురిస్తాయి, మాటలే దేశద్రోహమైతే అనే పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఓయూలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొ. కొండ నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయి కలలు చిగురిస్తాయి, మాటలే దేశద్రోహమైతే అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు కవితలు రాయడం వలన అది భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ దిశగా నేటి యువత అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. ఎస్. వేణుగోపాల్, పుస్తక రచయిత్రి సలీమ, లావణ్య, శ్రీనిధి, అనూష, రోజారాణి, సాత్విక, శ్రావణి, మహేష్, శివ, హాదిరామ్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

## పాత కేసులను ఎత్తివేయాలి : మేకల

**బౌద్ధనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాతో తనతో పాటు మరికొంత మంది నాయకులపై పోలీసులు కేసులు పెట్టారని, వాటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటాలు, ధర్నాలు చేశామన్నారు. సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావుగౌడ్ కార్యాలయం ముందు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశామని అప్పట్లో పదిహేనుమంది నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇందులో భాగంగా మంళవారం సికింద్రాబాద్ కోర్టుకు హాజరయ్యామన్నారు. తప్పుడు కేసులను ఉపసంహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నామన్నారు. ఈ కేసులో మహిళలు చాలామంది ఉన్నారని తెలిపారు.



బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన వివిధ సంఘాల నాయకులు

## బోయిన్‌పల్లి పోలీసుల పనితీరు అభినందనీయం

**బోయిన్‌పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** ఆషాఢమాసం బోనాల జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషిచేసిన బోయిన్‌పల్లి పోలీసుల పనితీరు అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయ ఫౌండర్ జంపన ప్రతాప్ అన్నారు. నగరంలో సికింద్రాబాద్ బోనాల తరువాత బోయిన్‌పల్లిలో బోనాల జాతర అతిపెద్దగా నిర్వహిస్తారు. ఈ బోనాల జాతరను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఫలహారం బండ్లను కూడా పెద్ద సంఖ్యలో ఊరేగిస్తారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లి బోనాల జాతర బోయిన్‌పల్లి పోలీసులకు సవాల్ లాంటిది. పెద్ద ఎత్తున జరిగే బోనాల జాతర ప్రశాంతంగా జరిగింది. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బోయిన్‌పల్లి, ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రాంతాలకు చెందిన వివిధ ఆలయాల నిర్వాహకులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టిన బోయిన్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. సీఐ మాట్లాడుతూ జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీలను భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు బిఎన్ శ్రీనివాస్, అశోక్, రాజు, ప్రేమ్ ముదిరాజ్, జహంగీర్ గౌడ్, నర్సింహ, శ్రీకాంత్, దుర్గయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, రైల్‌నిలయంలో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ (పిఎఫ్ఎ)గా విధులు నిర్వహిస్తున్న ఎ.వెంకటరెడ్డి గురువారం పదవీ విరమణ నేపథ్యంలో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావు, ప్రతినిధులతో కలిసి శాలువ, జ్ఞాపిక అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

\- చిలకలగూడ,ఆంధ్రజ్యోతి



కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయం వద్ద జరిగిన జాతరలో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు



పోతరాజులతో ఆలయకమిటీ సభ్యులు



బోయినపల్లిలో జరిగిన బోనాల పండుగ జాతరలో భాగంగా నిర్వహించిన ఫలహారబండి ఊరేగింపులో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు

# ముగిసిన బోనాల జాతర

**బౌద్ధనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ జాతర మంగళవారం తెల్లవారుజామున ఘనంగా ముగిశాయి. ఆలయం ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా భక్తులకు స్వాగతం పలుకుతూ స్టేజీలను ఏర్పాటు చేయటంతోపాటు మ్యూజికల్‌నైట్‌లను ఏర్పాటుచేశారు. స్టేజీల ముందు యువతీ, యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలను చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేజీపై టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఏర్పాటుచేసిన స్టేజీపై స్థానిక శాసనసభ్యుడు పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు సామలహేమ, సునీత, యువనాయకులు సుంకు రామచందర్, పోగర్తి భువనరావు, రాజుసుందరం, కరాటేరాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ఏర్పాటుచేసిన స్టేజీలపై మహాకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆయా స్టేజీ నిర్వాహకులు పలువురిని ఘనంగా సత్కరించారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అనుదీప్ బందోబస్తును పర్యవేక్షించారు.

### తిరుమలగిరిలో..

**తిరుమలగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** బొల్లారం సదర్‌బజార్‌లోని ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల జాతర వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. రమేష్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవాలయం నుంచి పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు స్థానికులను ఎంతో ఆకట్టుకున్నాయి. మాయదారి మైసమ్మ పాట మీద ఎం.రవీందర్ చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.




బొల్లారం తూంకుంటలోని విజన్ హైస్కూల్‌లో పోతరాజుల వేషధారణలో విద్యార్థులు



కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో 'విరాట్' ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

## భారతదేశ సామర్థ్యాలను మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

**అల్వాల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో తూర్పు నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ "హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర వ్యూహాలు" అనే అంశంపై మంగళవారం ప్రత్యేక ఉపన్యాసం చేశారు. భారతదేశ సామర్థ్యాలను మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు వ్యూహాల అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆయన చేసిన ఉపన్యాసం సముద్రతీర ప్రకృతి దృశ్యంపై సమగ్రమైన అవగాహన కల్పించింది. దాంతో పాటు భారతదేశ ప్రయోజనాలను పరిరక్షించడానికి చురుకైన విధానాన్ని ప్రేరేపించింది. ఈసందర్భంగా వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ సీడీఎంలో 'విరాట్' ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించారు. భారత నౌకాదళం గురించి సాయుధ దళాల అధికారులకు దిశానిర్దేశం చేయడానికి, ఇతర ప్రాంతీయ నైబర్‌హుడ్ స్ట్రాటజిక్ స్టడీస్ పరిశోధన కోసం ఈ ఫెసిలిటీ సెంటర్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.



టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ప్రధానోపాధ్యాయుడు ఆశీర్వాదం

## మెదడువాపు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలి

**బోయిన్‌పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** మెదడు వాపు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని, దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మెదడు వాపు వ్యాధి కూడా ఒకటని, దోమలు పందులను కుట్టిన తర్వాత మనుషులను కుడితే మెదడువాపు వ్యాధి సోకుతుందని, దీని నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ ప్రారంభించిన వ్యాక్సిన్ టీకాను తల్లితండ్రులు తమ పిల్లలకు వేయించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడువారాలపాటు మెదడువాపు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమంను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ వ్యాక్సిన్ టీకా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆశీర్వాదంలు టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో చదువుతున్న 1-5 ఏళ్ళ పిల్లలు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5-15 ఏళ్ల పిల్లలకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయాలని, అందుకోసం అవసరమైతే తలిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తప్పకుండా టీకాలు వేయాలని ఆశా వర్కర్లకు ఆయన సూచించారు. టీకాలు వేయడానికి పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు వైద్యులకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమమని, చిన్న పిల్లలకు చాలా ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.షద్రక్, హరనాధరావు, పద్మావతి, ఎఎం టి.శోభారాణి, సరిత, స్థానిక నాయకులు రామారావు, అజిత్ పాల్గొన్నారు.



నాగమల్లేశ్వరికి నియామకపత్రం అందజేస్తున్న చెన్నయ్య

## మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా నాగమల్లేశ్వరి

**పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి నియమితులయ్యారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల - చలో ఢిల్లీ' జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరగబోయే మహాధర్నాకు మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పాల్, నాయకులు కారంపూడి మైనర్‌బాబు, లక్ష్మణ్, బడుగు సాల్మన్, కందుకూరి జార్జ్, గొట్టిపాటి యోగి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నియామకపత్రం ఇస్తున్న సర్దార్ పుటం పురుషోత్తమరావు, తదితరులు

## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే శ్రీనివాస్ పటేల్

**పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్ అన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిజాం క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యేకు నియామక పత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు, సభ్యులు వీరమళ్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సి.విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరుకాపులతో పాటు బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం ఉన్నతికి ప్రభుత్వపరంగానూ, వ్యక్తిగతంగానూ చేయూత అందిస్తానన్నారు. అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మంగళారపు లక్ష్మణ్, ఆది విష్ణుమూర్తి,ఎస్.మల్లేష్, ఎర్ర నాగేందర్, ఊసా రఘు, అనిల్, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, రామారావు, పి.ఎల్.ఎన్ పటేల్ పాల్గొన్నారు

## డ్రంకెన్ డ్రైవ్‌లో కేసులో పదిమందికి జైలు, జరిమానా

**బోయిన్‌పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10మందిని బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి జైలుశిక్ష, జరిమానా విధించారు. మొదటిసారి పట్టుబడిన ఏడుగురికి రెండు రోజులు జైలుశిక్ష, రూ.2100 జరిమానా, రెండోసారి పట్టుబడిన ముగ్గురికి 4రోజుల జైలుశిక్ష, రూ.3300 జరిమానాను న్యాయస్థానం విధించింది. శనివారం బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ నాగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ఈ 10 మంది పట్టుబడ్డారు.

## నల్లపోచమ్మ దేవాలయంలో హుండీ చోరీ




హుండీని పగులకొట్టిన దొంగలు

**తిరుమలగిరి, జులై 30 (ఆంధ్రజ్యోతి):** తిరుమలగిరి ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో దొంగలు హుండీని పగులగొట్టి సొత్తును ఎత్తుకెళ్లిన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకోవడానికి అదే ప్రాంతానికి చెందిన ఓ భక్తుడు ఉదయం 6గంటలకు వచ్చాడు. అమ్మవారిని దర్శించుకోవడానికి పైకి వెళుతుండగా సీసీ కెమరాలను తొలిగించి కింద పడేసి ఉన్నాయి. దీంతో హుండీ తాళం కూడా పగలకొట్టి ఉండటంతో అమ్మవారి దర్శనానంతరం ఆ భక్తుడు దేవాలయ చైర్మన్ గోవిందరెడ్డి ఇంటికి వెళ్లి విషయాన్ని వివరించాడు. వెంటనే గోవిందరెడ్డి డైల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరుమలగిరి పోలీసులు దేవాలయానికి చేరుకొని దొంగ హుండీని పగులగొట్టిన తీరును పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో దేవాలయానికి చేరుకున్న క్లూస్ టీమ్ అన్ని నమూనాలను సేకరించారు. మరో సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

**తిరుమలగిరి, జులై 30 (ఆంధ్రజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి అరుణ ఎన్‌క్లేవ్‌కు చెందిన రాజ్యలక్ష్మి (61) భర్త చనిపోయాడు. కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితం అయిన ఆమె కొన్ని నెలలు పెద్ద కుమారుడు శ్రీనివాస్ వద్ద, కొన్ని నెలలు చిన్న కుమారుడి వద్ద ఉంటుంది. నేను బ్రతికి ఉండి ప్రయోజనం ఏమిటి అని తరచూ పెద్ద కొడుకు శ్రీనివాస్, పెద్ద కోడలితో అంటుండేది. అయితే మంగళవారం తెల్లవారుజామున పక్కనే ఉన్న పార్కు వద్ద ఒక చెట్టుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భావించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి ఫోటోతో పోలీసు సిబ్బందితో ఆ పరిసర ప్రాంతంలో విచారణ చేస్తుండగా ఆమె కుటుంబ సభ్యుడు ఆమె కోసం వెతుకుతూ పోలీసుల కంటపడ్డాడు. మృతురాలిని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ ఉత్తమ సిబ్బందిని సత్కరించిన మహాకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్

## రోడ్డు భద్రతపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం

**రాంగోపాల్‌పేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** తాగి వాహనాలు నడపడం, నిద్రలేమి వంటివి ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలకు కారణమని మహాకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ అన్నారు. మహాకాళి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం టీజీఆర్టీసీ రాణీగంజ్ డిపోలో రోడ్డు భద్రతపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపశంకర్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు అధిక శాతం మానవతప్పిదాల వల్లనే జరుగుతాయని, కుటుంబ సభ్యులతో సరిగ్గా ఉంటే వారు డ్యూటీలో ఉన్నవారిని వారి విధులకు భంగం కలిగించరని, అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్ కూడా ప్రమాదకరమని అన్నారు. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు లైన్ డిసిప్లీన్‌ను తప్పక పాటించాలని, దీని వల్ల ఎన్నో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ శ్వేత, ఎంఎస్ జ్ఞానేశ్వర్‌లతో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## రంగారెడ్డి రీజియన్‌లో..

# ఉచిత ప్రయాణికులు 2 కోట్ల మంది

**చాదర్‌ఘాట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులోకి వచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్‌లో ఇంతవరకు 2 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. మంగళవారం ఆర్టీసీ ఎంజీబీఎస్‌లోని రంగారెడ్డి రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి రోజు రంగారెడ్డి రీజియన్‌లో 85 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని వివరించారు. రీజియన్‌లోని 8 డిపోలకు చెందిన సుమారు 7 వందలకు పైగా బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు చేసే ఎక్స్‌ప్రెస్ బస్సులు, పల్లె వెలుగు బస్సులు 370 వరకు ఉన్నాయన్నారు.

### కొత్తగా 280 బస్సులు

సంవత్సర కాలంలో రంగారెడ్డి రీజియన్‌లో 280 కొత్త బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్ఎం శ్రీలత తెలిపారు.



జె.శ్రీలత రీజినల్ మేనేజర్

### వంద బస్సులకు ప్రతిపాదనలు

ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేందుకు కొత్తగా వంద బస్సులకు ప్రతిపాదించగా పరిశీలనలో ఉన్నట్లు ఆర్ఎం తెలిపారు. దూర ప్రాంతాల నుంచి బస్సులను నడుపుతూ ప్రయాణికులతో నగరానికి వచ్చే సుమారు 550 మంది ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి తీసుకోడానికి వీలుగా మెరుగైన ఏసీ విశ్రాంతి గదులను అందుబాటులోకి తీసుకువచ్చామని మేనేజర్ శ్రీలత తెలిపారు.

### కారుణ్య నియామకాలు...

కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే 30 మందిని కండక్టర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. మరో 20 మంది ఆర్టీసీ సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే రూ.4లక్షల వరకు వైద్య సాయం అందించేవారని, ఇకనుంచి వలంటీర్ రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగులకు కూడా వైద్య సాయం అందుతుందన్నారు.